# నెమళ్లొస్తున్నాయి జాగ్రత్త

**రాధామనోహరన్**

**'హార్ట్ పేషెంట్ పోయాడండీ' అంది తార వస్తూనే.**

"ఆస్పత్రన్నాక రోజూ ఎవడో ఒకడు పోతాడు. దానికంత యిదయిపోనక్కర్లేదు" నిర్లిప్తంగా అన్నాడు రాజు.

"పెద్దమనిషి కాబట్టి చెప్పాను" తెల్ల గౌన్లోంచి నల్ల చీరలోకి మారింది తార.

"కాఫీ ఇవ్వు... ఎవరా పెద్దమనిషి?" రాజు మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది.

"మీకసలు మానవత్వం లేదే... అయ్యో పాపం అనకుండా... డర్టీ శాడిస్ట్" తార కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఇది మరీ బావుంది... కేంద్ర ప్రభుత్వంవాళ్ళు... పద్మశ్రీ ఇచ్చిన వాడికి... పద్మభూషణ్ ఇచ్చినట్లు... నిన్న సినిక్ అన్నావు... ఇవ్వాళ శాడిస్ట్" కోపంగా అన్నాడు రాజు.

"నిజమే... యూ ఆర్ ఎ శాడిస్ట్... యూ ఆర్ వాట్ హ్యాపీ అన్లెస్ సంబడీ ఈజ్ అన్‌హ్యాపీ" నొక్కి నొక్కి చెప్పింది తార.

"ఇంతకీ ఎవరాయన?" రాజు టోన్ తగ్గించాడు, అనవసరంగా గొడవెందు కని.

"కే.కే.గారి ఫాదరు" మెత్తబడింది తార.

"మధ్యలో కే.కే. ఎవరు?"

"మీకు రెసిడెన్షియల్ కాలేజీలో లెక్కలు చెప్పటం తప్ప ఏం తెలీవు"

'తెలియకపోతే... చెప్పచ్చుగా'

"మనింటెదురుగా మయూరి ఎపార్ట్‌మెంట్స్... క్రిందంతస్థులో అద్దెకున్న ఫారెస్టాఫీసరు... చాలా పెద్ద ఉద్యోగంట... మూడు జిల్లాలకధికారిట... క్వార్టర్స్ ఖాళీ లేక తాత్కాలికంగా ఇక్కడుంటున్నారు కృష్ణకిషోర్‌గారు.''

"అంతేనా... ఇంకేమయినా మర్చిపోయావా?''రాజుకి కాఫీ విషంలా వుంది.

''అవునండోయ్... మర్చేపోయాను... వాళ్ళింట్లో ఆవుదూడంత కుక్క వుంది. హిట్లర్... నిజంగా హిట్లరే... పగలు కట్టేస్తారు... రాత్రి వదులుతారు. బాబోయ్ చూస్తేనే వణుకొస్తుంది''తార మాటలు వింటున్నట్లు నటించాడు రాజు.

"వాళ్ళ తమ్ముడమెరికాలో వుంటాట్ట... చెల్లెలు కెనడాట. ఇంట్లో అన్నీ విదేశీ వస్తువులే... ఏసీ కార్ నుంచీ వీసీఆర్ దాకా'' తార కళ్ళు మెరిశాయి.

''అయితే ఏంటిట... నా లెక్కల నోట్సు... నీ తెల్లగవునూ... మనకి తప్పవు కదా!''రాజు మాటలు మనసులోనే మణిగిపోయాయి.

"రేపెళ్ళి పరామర్శించండి...'' ఆర్డరేసింది తార.

"తెల్లారింది లెగండో... కొక్కురోకో

మంచాలింక దిగండో... కొక్కురోకో" పాట వినిపిస్తోంది వివిధ భారతి జనరంజని.

కాలేజీకి వెళ్తూ కే.కే. గారింటికెళ్ళాడు రాజు.

భౌ... భౌమంది హిట్లర్. తోకలేని నల్లని పులిలా వుంది డాబర్‌మన్... అది కనక మీదపడితే ఇంతే సంగతులు.

కే.కే.గారు హాల్లో పేం కుర్చీలో కూర్చుని పేపర్ చూస్తున్నారు.

'నేను... నర్సు... తార' రాజు పరిచయ వాక్యాలు పూర్తికాలేదు.

''తెల్సు... కూర్చో...'' పేపరు టీపాయి మీద పడేశారు కే.కే.గారు.

రాజుకిబ్బందిగా వుంది... ఏం మాట్లాడాలో తెలీలేదు.

"మీ ఫాదరు... గుండెపోటు... తార చెప్పింది'' రాజు మాటలు ముక్కలు, ముక్కలుగా విరిగిపోయాయి.

''రోగంతో బాధపడేకంటే... రోగి చనిపోవటం మంచిది. కొండా రెండు కాఫీ...'' కేకేసారు కే.కే.గారు.

''భౌ... భౌ... భవ్... భవ్.... భౌ... భౌ..'' కొండడి నేవు చూసి అరిచింది హిట్లర్.

"హిట్టీ... అరవద్దు... నిశ్శబ్దం"

కామ్‌గా కూర్చుంది కుక్క.

కొండంత మనిషి.. ఆటవిక జాతి నీగ్రోలాంటి కొండడు కాఫీ ఇచ్చాడు.

రాజు చేతులు వణికాయి.

''క్లాసుకి టైమయింది'' గొణిగాడు రాజు.

''సాయంత్రం సమయంలో వస్తూ వుండండి. చదరంగం ఆడుకుందాం... మీరు బాగా ఆడతారని తార సిస్టర్ చెప్పింది.''

తండ్రిపోయిన రెండో రోజు చెస్సంటాడేమిటి? రాజుకి మతిపోయింది.

అట్లా ప్రారంభమయిన స్నేహం క్షణక్షణప్రవర్ధమానమైంది. నెల రోజుల్లో రాజు స్టేటస్ పెరిగింది. అతను కే.కే. గారి భార్యకి అన్నయ్య. కే.కే.కి బావగారు. హిట్లర్‌కి మావయ్య. కొండడికి పంతులు అయిపోయాడు.

* * *

''రేపు నాకు శలవు... శ్రీశైలం వెళ్దాం... కే.కే.గారి కార్లో'' గోముగా అంది తార.

''నాకు శలవివ్వరు... కావాలంటే నువ్వెళ్ళు''

''జెరమొచ్చిందని ఫోన్ చేయండి... ఒక్క రోజుకేం కాదు''

సంభాషణలో ఎప్పుడూ... అంతిమ నిర్ణయం తారదే. లేకపోతే ఇల్లు హిరోషిమా... నాగసాకీ అయిపోతుంది. తార లేకపోతే రాజు కుటుంబం నడవదు. రోగిష్టి తండ్రి, వెర్రి తల్లి, పిచ్చి కూతురు, రౌడీ తమ్ముడు రోడ్డున పడతారు.

కారు ప్రయాణం సాఫీగా సాగింది.

ఫారిన్ ఎయిడ్ నుంచీ లోకల్ ఎయిడ్స్ దాకా చాలా విషయాలు మాట్లాడుకున్నారు. రాజు శ్రోత మాత్రమే. నాటక రచనల గోలలో పడిపోయిన రాజు తారతో ఒక్కసారి కూడా అట్లా మాట్లాడలేదు.

''వనవిహార్'' ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాట్లు బాగున్నాయి.

ప్రకృతి శోభాయమానంగా వుంది.

పగలు నిముషంలో గడిచిపోయింది.

గుడులూ, గోపురాలు, దేవుడూ, మోక్షం, భక్తి, ముక్తి.

రాత్రి...

పెద్ద హంగామా చేసాడు... స్థానిక అడవుల కంట్రాక్టర్.

ఫారిన్ మందు...

పేకాట...



తెలుగు కళాసమితి న్యూజెర్సీ –రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారు నిర్వహించిన

వెమలి పలావు...

బాగా తాగాడు రాజు... మూడు క్వార్టర్లు.

మత్తుగా మగతగా వుంది.

"మిగిలిన మాంసం ప్యాక్ చేసి... ఈకలు వేరే కట్టండి. అట్టపెట్టెలో పెట్టించండి. కొండడికి చెప్పి డిక్కీలో పెట్టండి" కంట్రాక్టరు మాటలు మాతిలో గొంతుకలా విని పించాయి రాజుకి.

రాజు మైకంలో వున్నాడు.

స్వప్నజగత్తులో విహరిస్తున్నాడు.

కలలో... కల్లా లక్ష్మీపతి రాజు... ఎలియాస్ కలరాజు... కలం రాజయ్యాడు. మద్రాసు ఫ్లయిట్‌లో వెళ్ళాడు. హోటల్ శ్రీలేఖలో డబుల్ రూంలో బస. పెద్ద బ్యానర్‌కి... కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే రాస్తు న్నాడు... సాయి శ్రీనారి మల్టీస్టారర్... సూపర్ డూపర్ చిత్రం "యుగాంతం". డైరెక్షన్ మణిరత్నం. మ్యూజిక్ రెహ్మాన్. హిందీ రైట్స్‌కి సుభాష్ ఘాయీ మంచీ ఫోన్... పన్నెండు కోట్లు... ట్రింగ్... ట్రింగ్... ఫోన్ కట్టయింది.

శిలువ మీంచి జీసస్‌లా లేచాడు రాజు

నిద్రకీ, మెలకువకీ మధ్యమన్న ఎర్రటి తాడు మీద వడుస్తున్నాడు. సర్క స్‌లో మరుగుజ్జు బఫూన్‌లా వున్నాడు రాజు. తనని చూస్తే తనకే నవ్వొస్తాది. వరండాలో వాతం కమ్మిన గుర్రంలా గురకపెడ్తున్నాడు కొండడు. గెస్ట్‌హౌస్ గోడ మీద... ఒనీడా రాక్షసుడిలాంటి... రేడియం వాల్‌క్లాక్... టిక్ టిక్ మంటోంది... తెల్లవారుజాము... మూడు గంటల అయిదు నిమిషాలు.

దాహం... దాహం... నాలిక పిడచకట్టుకుపోయింది. రూం తలుపు నెట్టాడు. రాలేదు. నీలి రంగు గాజు కిటికీలోంచి చూసాడు. బూజు, బూజుగా పాడయిన టి.వి. బొమ్మలా వుంది నిశ్చలన చిత్రం. డబుల్ కాట్ మీద కేకే, జాకీ, తార.

సిద్ధార్థుడిలా...
నిద్రలో నడిచే మానసిక రోగిలా...
స్లోమోషన్‌లో... నడుస్తున్నాడు రాజు.

తనదే తప్ప

తారని డబ్బు సంపాదించే యంత్రంలా చూసాడు.

ఎప్పుడూ ప్రేమగా చూడలేదు.

తన రచనల పిచ్చిలో పడి తారని విస్మరించాడు.

జాతీయ పక్షి నెమలిని చంపటం నేరం. చట్టరీత్యా నెమలి పలావు చెయ్యటం ఘోరం. వన్యమృగ రక్షణాతిక్రమణ నేరానికి రెండేళ్ళ కారాగార శిక్ష వేశారు రాజుకి. సికిందరాబాద్ జైల్లో వున్నాడు.

కే.కే. ప్రమోషన్ మీద చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ అయి జంటనగరాల్లో వున్నాడు.

ఆయన హెల్ప్‌తో తార ఉస్మానియాలో చీఫ్‌నర్సింగ్‌సూపరింటెండెంట్ అయింది.

విడుదలయిన రాజు ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో వున్నాడు.

చిన్ననాటి స్నేహితుణ్ణి చూడాలని వెళ్ళాను.

రాజు నన్ను గుర్తుపట్టలేదు.

అప్పుడే కరెంట్ షాకిచ్చి ప్రక్క మీద పడుకోబెట్టారు.

జీవంలేని గాజుకళ్ళతో శూన్యంలోకి చూస్తున్నాడు.

వార్డ్ నుంచీ ఆస్పత్రి కాంపౌండ్‌లోకి వచ్చాను.

"బాగున్నారా! అన్నయ్యగారూ!!" పలకరించింది తార.

ఆస్పత్రి గేటు దగ్గరున్న పున్నాగ చెట్టు మీద పెద్ద అడవి నెమలి గట్టిగా క్రీంకరించింది.

ఆ నెమలికేకకి... నాకు భయమేసింది.

ఒళ్ళంతా ముచ్చెమట్లు పోసాయి. నా హృదయం మనసుని...

'నెమళ్ళున్నాయి జాగ్రత్త' అని హెచ్చరించింది.

